


సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధి ప్రొఫెసర్ కే మురళీమనోహర్, ఫెడరేషన్ నేతలు

# బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

- సమగ్ర కులగణన తప్పులతడక
- అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి, మంత్రుల పచ్చి అబద్ధాలు
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పెంచుకునేందుకు పాలకుల కుట్ర
- పీపుల్ కమిటీ సమావేశంలో బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేతలు

హైదరాబాద్ సిటీ బ్యూరో/ ఖైరతాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): సమగ్ర కులగణన పేరిట కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందని బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధి ప్రొఫెసర్ కే మురళీమనోహర్ విమర్శించారు. బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం కులగణనపై పీపుల్ కమిటీ సమావేశం నిర్వహించారు. మురళీమనోహర్ మాట్లాడుతూ.. సమగ్ర కులగణన పేరిట సీఎం రేవంత్, మంత్రులు అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పారని ఆరోపించారు. అసెంబ్లీలో రేవంత్ ప్రవేశపెట్టిన కులగణన నివేదికలో అబద్ధాలు మాత్రమే ఉన్నాయని మండిపడ్డారు. బీసీ కులగణన చేపట్టాలన్న రాహుల్‌గాంధీ ఆశయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. 2014లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో బీసీల జనాభా 52 శాతం ఉన్నట్టు తేలితే.. పదేండ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 46 శాతానికి ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు.

## సర్వే కమిటీకి మంత్రి చైర్మనా?

సర్వే కమిటీకి మంత్రి ఉత్తమ్‌ను నియమించినప్పుడే కులగణనపై ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో తేలిపోయిందని బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. 42% రిజర్వేషన్లు కల్పించాలని బీసీలు ఉద్యమం చేపడతారనే భయంతోనే నామమాత్రపు సర్వే చేసినట్టు ఆరోపించారు.

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పెంచడానికే

రాష్ట్రంలో బీసీల జనాభాను తక్కువ చేసి చూపించి, ఓసీల సంఖ్య పెంచుకుని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పెంచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేసిందని ఆరోపించారు.

## కులగణన శాస్త్రీయంగా చేపట్టాలి

బీహార్, కర్ణాటక తరహాలో జస్టిస్ ఈశ్వరయ్య కమిషన్ ఏర్పాటు చేసి మళ్లీ కులగణన చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నామమాత్రంగా సర్వే చేయడంతో రాష్ట్రంలో 3% కుటుంబాలు పాల్గొనలేకపోయాయన్నారు.

## పార్టీపరంగా 42 శాతం డ్రామా

బీసీలను రాజకీయంగా అణగదొక్కేందుకే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున 42% సీట్లిస్తామని రేవంత్ ప్రకటించారని దుయ్యబట్టారు. ఓడిపోయే స్థానాల్లో బీసీలకు సీట్లిచ్చారని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ అంటే పార్టీలో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి చేతులు దులుపుకోవడమేనా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి బీసీల సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

# రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం

- యూజీసీ నిబంధనలు మార్చాలి
- మాజీ మంత్రి, ఓబీసీ కన్వీనర్ వీ శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): యూజీసీ ముసాయిదా నిబంధనలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని, వాటిని మార్చాల్సిందేనని మాజీ మంత్రి, ఓబీసీ సంఘం కన్వీనర్ వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాలపై కేంద్ర ప్రభుత్వ పెత్తనాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద డీఎంకే స్టూడెంట్స్ వింగ్ నేతృత్వంలో జరిగిన యూజీసీ ముసాయిదా నిబంధనల వ్యతిరేక ఉద్యమానికి అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం (ఏఐవోబీసీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌తో కలిసి గురువారం శ్రీనివాస్‌గౌడ్ మద్దతు తెలిపి మాట్లాడుతూ.. యూజీసీ ముసాయిదా నిబంధనలు విద్యను వ్యాపారం చేసేలా, హక్కులను బలహీనపరిచేలా ఉన్నాయని విమర్శించారు.

# సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం : విద్యావేత్తలు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): వీసీల నియామకానికి సెర్చ్ కమిటీల ఏర్పాటు బాధ్యతను గవర్నర్‌కు అప్పగించడం, వర్సిటీ బోధనా సిబ్బంది నియామకంపై యూజీసీ తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ విద్యా కమిషన్ ఆధ్వర్యంలో 'యూజీసీ రెగ్యులేషన్-రాష్ట్ర యూనివర్సిటీల్లో జోక్యం' అనే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ఎస్సీఈఆర్టీ క్యాంపస్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యూజీసీ గైడ్‌లైన్స్‌తో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందని పేర్కొన్నారు. విద్యా కమిషన్ చైర్మన్ మురళి, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్లు హరగోపాల్, శాంతాసిన్హా, రమా మెల్కొటే, నరసింహారెడ్డి, కోదండరాం, తిరుపతిరావు, మురళీమనోహర్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, పద్మజాషా పాల్గొన్నారు.



కేంద్ర మానవనరుల అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, బాల్క సుమన్, పార్టీ నేతలు

# రాష్ట్రాల హక్కులు కాలరాయొద్దు

మొదటిపేజీ తరువాయి...

అప్పగిస్తూ యూజీసీ తీసుకొస్తున్న నిబంధనలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఢిల్లీలో కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం కేంద్ర మానవనరుల అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్, కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని కలిసింది. ఆయా అంశాలపై బీఆర్ఎస్ వైఖరిని లిఖితపూర్వకంగా అందజేసింది. అనంతరం కేటీఆర్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. యూజీసీ నూతన మార్గదర్శకాలపై విద్యారంగ మేధావులతో లోతుగా చర్చించి, ధర్మేంద్ర ప్రధాన్‌కు ఆరు పేజీల వినతిపత్రం అందజేశామని తెలిపారు. కేంద్రం గవర్నర్ల ద్వారా రాష్ట్ర యూనివర్సిటీల పాలన, నియామకాలను చేతుల్లోకి తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని హెచ్చరించారు. రాష్ట్రాల హక్కులను కాలరాసేలా ఉన్న నిబంధనలను ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరామని తెలిపారు. యూజీసీ మార్గదర్శకాల్లో సరైన అభ్యర్థులు (నో సూటబుల్ క్యాండిడేట్ ఫౌండ్) అనే నిబంధనలను చేర్చడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్న రిజర్వేషన్ల ప్రకారం కాకుండా అభ్యర్థులు దొరకలేదనే సాకుతో ఆ ఉద్యోగాలు ఇతర క్యాటగిరీలతో భర్తీ చేసే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. అలా చేయడం రాజ్యాంగ విరుద్ధమని, దాని ద్వారా ఆయా సామాజిక వర్గాలకు దక్కిన హక్కును కేంద్రం హరించినట్టే అవుతుందని స్పష్టంచేశారు. వర్సిటీ ఉద్యోగాల భర్తీలో విద్యార్హతలకు మాత్రమే కాకుండా పరిశోధనలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వీసీ నియామకంలో పారదర్శకతను పాటించాలని కేంద్రానికి స్పష్టంచేశామని చెప్పారు.

## మిడ్‌మానేర్ మీదుగా రైల్‌కమ్ రోడ్ బ్రిడ్జి నిర్మించాలి

మిడ్ మానేరు మీదుగా రోడ్ కమ్ రైల్ బ్రిడ్జిను నిర్మించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశామని కేటీఆర్ వెల్లడించారు. గతంలో వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్నప్పుడు మంజూరైన ఎన్‌హెచ్-365 (బీ)ని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలు, మధ్యమానేరు జలాశయం మీదుగా ధవళేశ్వరం దగ్గర వంతెన మాదిరిగా రైల్ కమ్‌రోడ్ బ్రిడ్జి నిర్మించాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ సూచించారని చెప్పారు. ఆ మేరకు ఎన్‌హెచ్-365 (బీ)ని కోరుట్ల మీదుగా తీసుకెళ్లి ఎన్‌హెచ్-63కి అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశామని వివరించారు. దీనిపై నితిన్‌గడ్కరీ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు పడాల్సిందే

పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై వేటు పడాల్సిందేనని, ఈ విషయంలో తాము రాజీలేని పోరాటం చేస్తున్నామని కేటీఆర్ స్పష్టంచేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటుపడాలని, ఉప ఎన్నికలు రావాలని ఆయా నియోజకవర్గాల్లో ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అనర్హతవేటు విషయంలో ఇప్పటికే తమ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో నోటీసులు జారీచేసిందని గుర్తుచేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యేల అనర్హత వేటు విషయంలో న్యాయవాదులు, న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందంలో విద్యాశాఖ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, బాల్క సుమన్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్, వాసుదేవరెడ్డి తదితరులు ఉన్నారు.

# సర్వే నివేదికను సమీక్షించాల్సిందే

- అప్పుడే ప్రభుత్వంతో చర్చలు
- లేకుంటే చలో హైదరాబాద్ తప్పదు
- బీసీ సంఘాలు, మేధావుల హెచ్చరిక



బేగంపేటలో సమావేశమైన బీసీ సంఘాల నేతలు, మేధావులు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): కులగణన నివేదికను ప్రభుత్వం పునఃసమీక్షించి తప్పులను సరిదిద్దాల్సిందేనని, అప్పుడే ప్రభుత్వంతో తాము చర్చిస్తామని బీసీ సంఘాల నేతలు, మేధావులు అల్టిమేటం జారీచేశారు. లేదంటే బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కులగణన నివేదికపై భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించేందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ మేధావుల ఫోరం చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి టీ చిరంజీవులు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్, బీసీ కుల సంఘాల జేఈసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారితోపాటు పలువురు బీసీ సంఘాల నేతలు బేగంపేటలోని ఓ ప్రైవేటు హోటల్లో సమావేశమయ్యారు. బీసీ ఉద్యమాన్ని విస్తృతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించారు. 'ఏది నిజం' పేరిట 9న బీసీ ప్రజాప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

## సీఎం రేవంత్ బీసీల ద్రోహి: ఉపేంద్ర

సర్వే చేయించి బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి, ఇప్పుడు కోర్టు తీర్పులను సాకుగా చూపుతూ పార్టీపరంగా సీట్లు ఇస్తామని మాట మార్చడం అత్యంత దుర్మార్గమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల ద్రోహి అని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర నిప్పులు చెరిగారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అబద్ధాలకు ప్రతిరూపమే కాంగ్రెస్ అని ఆయన మండిపడ్డారు.

# ఇంతింతై వటుడింతైన ఎన్‌టీటీ సేవలు

- మూడేండ్ల క్రితం 50 మందితో షురూ
- నేడు 400 మందికి ఉపాధి అవకాశాలు: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): స్నేహితుడి సహాయంతో మూడేండ్ల క్రితం కొద్దిమందితో ప్రారంభించిన ఎన్‌టీటీ సేవలు ఇంతింతై వటుడింతైనట్టుగా పెరిగాయని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. 'మూడేండ్ల క్రితం నా మిత్రుడు సంజీవ్ దేశ్‌పాండే సహాయంతో ఆదిలాబాద్‌లో 50 మందితో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీ ఎన్‌టీటీ డాటా సేవలను ప్రారంభించాను. ఇప్పుడు సంఖ్య పెరిగి 400 మందిని దాటినట్టు తెలిసింది. ఎన్‌టీటీ డాటా ఉద్యోగులు 280 మంది, బీడీఎన్టీ ల్యాబ్స్ ఉద్యోగులు 70 మంది ఉన్నారు. నివేదా బిజినెస్ సొల్యూషన్స్ (ఇంక్యూబేటర్ సెంటర్)లో 30 మందికిపైగా సభ్యులకు శిక్షణ ఇస్తున్నారు. మేము టైర్-2 పట్టణాల్లో ప్రారంభించిన ఐటీ సేవలు గొప్ప విజయం సాధించాయనడానికి ఇదో నిదర్శనం' అని గురువారం ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు.

## పడకేసిన పల్లెలు.. మొద్దునిద్రకు సూచికలు

పడకేసిన పల్లెలు రాష్ట్రంలో పాలకుల మొద్దునిద్రకు సూచికలని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి గ్రామ సచివాలయాల దాకా పాలన పడకేసిందని ఎక్స్ వేదికగా విమర్శించారు. పడకేసిన పారిశుద్ధ్యంతో ప్రజలు రోగాలపాలు అవుతున్నారని, వీధిదీపాలు వెలగక చిమ్మచీకట్లు అలముకున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాపాలన.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని ధ్వజమెత్తారు. ప్రత్యేకాధికారుల పాలనకు ఏడాదైనా కండ్లు తెరవరా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో పల్లెప్రగతితో రూపురేఖలు మారి పంచాయతీలకు ఠంచన్‌గా నిధులు వచ్చాయని గుర్తుచేశారు.

# ఏకకాలంలో 'రైతుభరోసా' విడుదల చేయాలి

- సర్పంచులకు తక్షణమే పెండింగ్ బిల్లులు ఇవ్వాలి
- లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తాం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : రైతు భరోసా నిధుల విడుదలలో తాత్సారంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏకకాలంలో రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ చేయాలని, అలాగే సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. గురువారం పలువురు మాజీ సర్పంచులు ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో కలిశారు. పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో కలిగే ఇబ్బందులను కవిత దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో రైతుబంధు నిధులు 'టంగ్ టంగ్' మని రైతుల ఖాతాల్లో పడేవని, రేవంత్‌రెడ్డి సర్కార్‌లో మాత్రం దశలవారీగా నామమాత్రపు నిధులు మాత్రమే విడుదల చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు సేవ చేసిన గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులను మోసం చేయాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## నీటి కోసం మళ్లీ అరిగోస..

వేసవికి ముందే గోదావరిని ఏడారి చేశారంటూ రేవంత్ సర్కార్‌పై ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. కేసీఆర్‌పై కక్షలో భాగంగా సజీవ జలధార వట్టిపోయేలా చేశారని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. మేడిగడ్డ నుంచి ధర్మపురి వరకు గోదావరిని బీఆర్ఎస్ ప్రభుత్వం సజీవ జలధారగా మార్చిందని, మండే ఎండలోనూ నిండుకుండను తలపించేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరిలోనే గోదావరి వట్టిపోయి ఎడారిని తలపిస్తున్నదని, ఏప్రిల్, మేలో పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందోనని ఆందోళన వ్యక్తంచేశారు. తలాపునే గోదావరి ఉన్నా గుక్కెడు నీటి కోసం మళ్లీ అరిగోస పడే రోజులను కాంగ్రెస్ ప్రభుత్వం 'గ్యారెంటీ'గా తెచ్చిందని విమర్శించారు. 'కేసీఆర్ హయాంలో నీటితో కళకళలాడిన గోదావరి నది.. నేడు వేసవి రాకముందే ఎడారిని తలపిస్తున్నది. సుందిళ్ల బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో గతంలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కోల్‌బెల్ట్ బ్రిడ్జి వద్ద నిండుగా నీళ్లు ఉండేవి. ప్రస్తుతం ఆ బ్యారేజీలో కాంగ్రెస్ సర్కార్ నీటిని నిల్వ చేయకపోవడంతో అక్కడి గోదావరిలో చిన్న ప్రవాహమే ఉంది' అని గోదావరినదిలో ఇసుక తేలిన దృశ్యాలను ఆమె పోస్టు చేశారు.

## సర్కారు నిర్లక్ష్యం.. పాలమూరుకు శాపం

14 నెలలుగా పాలమూరు ఎత్తిపోతలను రేవంత్‌సర్కార్ కోల్డ్ స్టోరేజీలో పెట్టిందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ప్రాజెక్టుకు అనుమతుల సాధనను గాలికొదిలేసిందని ఎక్స్ వేదికగా ఆరోపించారు. ముందుచూపుతో కేసీఆర్ పాలమూరుకు 90 టీఎంసీల నికరజలాలు కేటాయించి ప్రాజెక్టును గట్టెక్కించే ప్రయత్నం చేస్తే, ఆ విషయాన్ని కేంద్రానికి సరిగా చెప్పలేక తుది అనుమతులను మరింత సంక్లిష్టం చేసిందని విమర్శించారు. ఫలితంగా కృష్ణా జలాల నీటి కేటాయింపులు తేలేవరకు పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలేమని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం తేల్చి చెప్పిందని ధ్వజమెత్తారు.

# భూదందాల బీర్ల ఐలయ్య

- అమాయక గిరిజనుల భూములపై కన్ను
- పీఏ, డ్రైవర్ పేరిట అసైన్డ్ భూముల జీపీఏ
- ఆలేరు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తాం
- మాజీ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే సునీత



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఆలేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.. భూ దందాల ఐలయ్యగా మారారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణభవన్‌లో గురువారం బీఆర్ఎస్ నేత బీసు చందర్‌గౌడ్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. గతంలో కొలనుపాకలో బీర్ల ఐలయ్య భూకబ్జా బాగోతం బట్టబయలైందని, తాజాగా ఆలేరు రెవెన్యూ తండాలో భూదందాకు తెరలేపారని మండిపడ్డారు. అమాయక గిరిజనుల భూములపై కన్నేసి అనుయాయులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. 1996లో 16 ఎకరాలను 9 మంది గిరిజనులకు అసైన్డ్ భూములు కేటాయించారని, ఆ భూములు అమ్మడానికి, కొనడానికి వీలు లేదని స్పష్టంచేశారు. కానీ, 2024 నవంబర్‌లో కొన్ని ఎకరాలను ఎమ్మెల్యే ఐలయ్య తన డ్రైవర్ కుమారస్వామి, పీఏ బాలరాజుకు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ(జీపీఏ) చేశారని విమర్శించారు. వారిద్దరి పేరిట జీపీఏ అయిన కొన్ని రోజులకే ఆ భూములు అమ్మేశారని మండిపడ్డారు. వాటిని కొన్నవారు కూడా ఐలయ్య బంధువులేనని చెప్పారు. భూములకు డిసెంబర్‌లో నాలా కన్వర్షన్ కూడా జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను మీడియాకు చూపించారు. వెంటనే ఈ సేల్‌డీడ్స్ రద్దు చేసి అసలైన హక్కుదారులకు భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. చిన్నచిన్న వాటికే బీఆర్ఎస్ నేతలపై కేసులు పెడుతున్న ప్రభుత్వం, బీర్ల ఐలయ్య విషయంలో చోద్యం చూస్తున్నదని మండిపడ్డారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఏ తప్పు చేసినా చర్యలుండవా? అని ప్రశ్నించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి ఐలయ్యపై చర్యలు తీసుకోవాలని కోరుతామని చెప్పారు. చర్యలు తీసుకోని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి బాటలోనే బీర్ల ఐలయ్య పోకడలు ఉన్నాయని, భూ దందాల్లో రేవంత్‌రెడ్డినే ఎమ్మెల్యేలు ఫాలో అవుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# జాతీయహోదా సాధనలో విఫలం

## రేవంత్ ఢిల్లీకి 31సార్లు వెళ్లినా ప్రయోజనం శూన్యం

## బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయహోదా సాధించడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమైనట్టు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. పాలమూరు ఎత్తిపోతలకు కాంగ్రెస్, బీజేపీ శాపంలా మారాయని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో పాలమూరు ఎత్తిపోతలకు జాతీయహోదా ఇవ్వలేమని కేంద్రం సమాధానం ఇచ్చిన నేపథ్యంలో.. బీజేపీ నేతలు దీనిపై సమాధానం చెప్పాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాలమూరు బిడ్డనని చెప్పుకొనే సీఎం రేవంత్.. ఏడాదిగా పాలమూరు ఎత్తిపోతలను పడావుపెట్టారని విమర్శించారు. ఢిల్లీకి 31సార్లు వెళ్లినా ఒక్కసారి కూడా పాలమూరు ఎత్తిపోతల గురించి కేంద్రాన్ని అడిగిన పాపాన పోలేదని మండిపడ్డారు. ఇప్పటికే 90 శాతం పూర్తయిన ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎమ్మెల్యేలను గెలిపించినందుకు కాంగ్రెస్, ఒక ఎంపీని గెలిపించినందుకు బీజేపీ పాలమూరు ప్రజలకు ఇస్తున్న రిటర్న్ గిఫ్ట్ ఇదేనా? అని ప్రశ్నించారు.

# జీపీలను నాలుగు గ్రేడ్లుగా విభజించాలి

## మంత్రి సీతక్కకు టీపీఎస్ఏ వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తేతెలంగాణ): పంచాయతీలను 4 గ్రేడ్లుగా విభజించాలని మంత్రి సీతక్కకు తెలంగాణ పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. తన నివాసంలో యూనియన్ క్యాలెండర్, డైరీని గురువారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీఎస్ఏ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. క్యాడర్ స్ట్రెంత్‌ను బలోపేతం చేసి ప్రమోషన్లు కల్పించాలని, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని, మెడికల్ ఇన్‌వాల్యేషన్ ద్వారా నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు.


